# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 4 | సంచిక: 81 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శనివారం 4 జులై 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# 5 ఎకరాల వరకు 'రైతుభరోసా' నిధులు విడుదల



**హైదరాబాద్, జులై 3 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రంలోని అన్నదాతలకు ప్రజా ప్రభుత్వం తీపి కబురు అందించింది. యాసంగి/ వానకాలం పెట్టుబడి సాయానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రైతుభరోసా' నిధుల విడుదల కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోంది. అర్హులైన రైతులందరికీ పెట్టుబడి సాయం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం నిధులను విడుదల చేస్తోంది. ఇందులో భాగంగా తాజాగా 5 ఎకరాల లోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతుల ఖాతాల్లోకి రైతుభరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమం వరుసగా నాలుగో రోజుకు చేరింది. తక్కువ భూమి ఉన్న రైతులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ, విడతల వారీగా అకౌంట్లలో డబ్బులు జమ చేసే ప్రక్రియను వ్యవసాయ, ఆర్థిక శాఖలు ముమ్మరం చేశాయి. మొదటి రోజు ఒకటి, రెండు ఎకరాల లోపు ఉన్న రైతులతో ప్రారంభమైన ఈ ప్రక్రియ.. నిరంతరాయంగా సాగుతూ నేడు 5 ఎకరాల పరిమితి వరకు ఉన్న రైతులందరికీ వర్తింపజేశారు. నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకే (ఐడీ ద్వారా) నగదు జమ అవుతుండటంతో రైతుల మొబైల్‌కు మెసేజ్‌లు వస్తున్నాయి. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన తరుణంలో, సకాలంలో పెట్టుబడి సాయం అందడంపై రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లకు ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో లాగా కాకుండా, ఎలాంటి దళారుల ప్రమేయం లేకుండా. నేరుగా తమ అకౌంట్లలోకే డబ్బులు రావడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం.. ఇచ్చిన మాట ప్రకారం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, మిగిలిన రైతులకు కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా రాబోయే రోజుల్లో నిధులు జమ అయ్యేలా అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని సచివాలయ వర్గాలు వెల్లడించాయి.

## రూ.8.21 లక్షల కోట్లు అప్పులు చేసింది

# మీరు కాదా?

## కేసీఆర్, హరీశ్‌రావులకు భట్టి కౌంటర్ ఎటాక్



### హరీశ్‌పై భట్టి తీవ్ర విమర్శలు


### అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్

### కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ భారం తగ్గించిందన్న డిప్యూటీ సీఎం

### సింగరేణిని బీఆర్ఎస్ సంక్షోభంలోకి నెట్టిందని విమర్శ

**హైదరాబాద్, జులై 3 (ప్రభాత ఉదయం)**

గత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేసిన భారీ అప్పులు, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రస్తుతం లేనిపోని అబద్ధాలను ప్రచారం చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన తప్పులను తక్కువ చేసి చూపించేందుకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారని భట్టి విక్రమార్క అన్నారు. మంత్రిగా పనిచేసిన విషయాన్ని మరిచిపోయి హరీశ్ మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్పష్టమైన లెక్కలను బయటపెట్టిన ఆయన.. గత పాలకులు రాష్ట్రంపై సుమారు రూ. 8,21,651 కోట్ల అప్పులు , బకాయిల భారాన్ని మిగిల్చారని, వాటిని ప్రస్తుత ప్రభుత్వం ఎంతో శ్రమతో క్రమబద్ధీకరిస్తోందని వెల్లడించారు. అలాగే రెసిడెన్షియల్ పాఠశాలల్లోని పిల్లలకు నాణ్యమైన భోజనం, బట్టలు , కనీస సౌకర్యాలను కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తమ ప్రభుత్వం వచ్చాకే విద్యా సంస్థల్లోని వసతులను మెరుగుపరిచి సంక్షేమానికి పెద్దపీట వేసిందని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను డిప్యూటీ సీఎం తీవ్రంగా ఖండించారు. బొగ్గు గనుల కేటాయింపులు, ఉత్పత్తికి సంబంధించి గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించి సంస్థను నష్టాల్లోకి నెట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం సింగరేణిని కాపాడుకోవడానికి అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని వివరించారు. సింగరేణిలో జరిగిన గత ప్రభుత్వ కాలపు అక్రమ వ్యవహారాలపై తాము విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తున్నట్లు ఈ సందర్భంగా భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో, ..మిగతా 2లో



### బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న రుణాలు

# రూ.4.17 లక్షల కోట్లే

### మంత్రి జూపల్లి కృష్ణారావుకు హరీష్ రావు లేఖ


**హైదరాబాద్, జులై 3 (ప్రభాత ఉదయం)**

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు... ఈ మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావుకు బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో చేసిన ప్రసంగాల వీడియోలు, ఆర్బీఐ గణాంకాలు సహా పలు ఆధారాలను మంత్రి జూపల్లి వాట్సాప్‌కు పంపినట్లు వెల్లడించారు. హరీశ్‌రావు లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ల పాలనలో తీసుకున్న రుణాలు, ప్రభుత్వ హామీతో తీసుకున్న రుణాలు కలిపి మొత్తం రూ. 4.17 లక్షల కోట్లేనని అసెంబ్లీలో వివరించినట్లు తెలిపారు. ఆ లెక్కలపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని అప్పుడే ప్రకటించానని గుర్తు చేశారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ నుంచి 2026 జూన్ వరకు రూ. 1,77,058 కోట్ల అప్పు చేసినట్లు మంత్రి జూపల్లి తన లేఖలో పేర్కొన్నారని తెలిపారు. అయితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం 2026 జూన్ 30 నాటికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పు రూ. 1,86,067 కోట్లుగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. మరోవైపు, 2026 మార్చి 18న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రభుత్వం చేసిన ఎఫ్ఆర్బీఎం, ఇతర అన్ని రకాల రుణాలు కలిపి రూ. 3,47,294 కోట్లుగా ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ ..మిగతా 2లో

## లోయలో పడ్డ బస్సు

### 40మంది ప్రయాణికుల దుర్మరణం

### పాకిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం



2

### దేశంలో తొలిసారిగా

## ఇడి సంచలన నిర్ణయం

### స్వాధీనం చేసుకున్న విమానం వేలం



## బంగాళాఖాతంలో అల్పపీడనం

### రాష్ట్రంలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు!

### మూడు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు

### పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

**హైదరాబాద్, జులై 3 (ప్రభాత ఉదయం)**

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్ష సూచన ఉన్నట్లు ..మిగతా 2లో

### అబద్ధాల లేఖలతో హరీష్ రావు

# ప్రచారం

### ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్న జూపల్లి

### సవాల్‌పై కట్టుబడి ఉన్నందునే వచ్చానని వెల్లడి

### బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ మంత్రి

**హైదరాబాద్, జులై 3 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ అప్పులపై సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు సిద్ధమని ప్రకటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు సాయంత్రం ప్రెస్‌క్లబ్‌కు వచ్చారు. శుక్రవారం ఉదయం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌కు ఆయన సవాల్ విసిరారు. సాయంత్రం 5 గంటలకు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు వస్తానని ..మిగతా 2లో






### కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల

# నటన అద్భుతం

### కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా

**హైదరాబాద్, జులై 3 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్, భారాస నేతల నటన అద్భుతంగా ఉందని, బిగ్‌బాస్ షోను తలపిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ప్రజలు మీ నాటకాలు చూసి నవ్వుకుంటున్నారు. అబద్ధాలకు ఆస్కార్ అవార్డు ఇస్తే రెండు పార్టీలూ అర్హత సాధిస్తాయని అన్నారు. గురుకులాల టెండర్లు, తెలంగాణ అప్పులతోపాటు అవినీతి, అక్రమాలపైనా చర్చిద్దాం రండి. మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆధ్వర్యంలో తేదీ, సమయం, వేదిక ..మిగతా 2లో

# రూ.8.21 లక్షల కోట్లు అప్పులు చేసింది మీరు కాదా?

మొదటి పేజీ తరువాయి...

బయటా అబద్ధపు ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించిన ఆయన, దమ్ముంటే తమతో నేరుగా బహిరంగ చర్చకు రావాలంటూ మాజీ సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు.బీఆర్ఎస్ పాలనలో చేసిన అప్పులపై కేసీఆర్ స్పందించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో మొత్తం అప్పు రూ.8.21 లక్షల కోట్లు అని.. మొత్తం అప్పుల్లో గత ప్రభుత్వ బకాయిలు ఉన్నాయని తెలిపారు. అప్పులు అన్నీ వాస్తవాలు కాదా.. వీటిని ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పులను తక్కువ చేసి చూపేందుకే కేటీఆర్, హరీశ్ ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి మండిపడ్డారు. మంత్రిగా పనిచేశానని మర్చిపోయి మరీ హరీశ్ మాట్లాడుతున్నారని.. అనేక అంశాలపై అబద్ధాలు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తేవాలన్నారు. బీఆర్ఎస్ నేతల అబద్ధాలు ప్రజల్లోకి వెళ్లకూడదన్నారు. సోషల్ మీడియా ద్వారా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాల పునాదులపై పదేళ్లు పరిపాలించారని.. బీఆర్ఎస్ చేసిన అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విరుచుకుపడ్డారు. అప్పుల భారం రాష్ట్రంపై వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు అనేక విషయాలపై అబద్ధాలు చెబుతున్నారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకురావాలి. బీఆర్ఎస్ నేతలు చెప్పే అవాస్తవాలు ప్రజల్లోకి వెళ్లకూడదు. సోషల్ మీడియా వ్యవస్థల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. అబద్ధాల పునాదులపై పదేళ్లపాటు పరిపాలన చేశారు. బీఆర్ఎస్ నేతలు కావాలనే ప్రభుత్వంపై పదేపదే దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ పార్టీ హయాంలో చేసిన అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్‌కు సవాల్ విసురుతున్నాం. 2014 నుంచి 2023 వరకు అప్పులు చేసి రాష్ట్రంపై పెనుభారం వేసింది నిజం కాదా? వివిధ మార్గాల ద్వారా మీరు చేసిన అప్పు రూ.8.21లక్షల కోట్లు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారు?అప్పుల అంశంపై నిత్యం మాట్లాడితే రాష్ట్రం పరువు పోతుందని తగ్గాం. మేం వచ్చాక రూ.2.08లక్షల కోట్లు చెల్లించాం. 10 శాతం వడ్డీకి కూడా మీరు అప్పులు తెచ్చారు. కట్టాల్సిన వడ్డీని రూ.34 వేల కోట్ల నుంచి రూ.11వేల కోట్లకు తగ్గించాం. బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. సింగరేణిపై ప్రతిరోజూ అబద్ధాలు చెబుతున్నారు' అని భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు.



## దోషులను కఠినంగా

# శిక్షించాల్సిందే

**అయోధ్య చోరీపై ఆర్ఎస్ఎస్ ఆందోళన**

**హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వారిని వదలరాదు**

**ఈ ఘటనతో హిందూ వ్యతిరేక శక్తులకు అవకాశం ఇవ్వరాదు**

**విచారం వ్యక్తం చేసిన ఆర్ఎస్ఎస్ ప్రతినిధి దత్తాత్రేయ హోసబలే**

**న్యూఢిల్లీ, జులై 3 (ప్రభాత ఉదయం)**

అయోధ్య రామ మందిర విరాళాల చోరీ ఘటనపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆర్ఎసెస్ ఆందోళన వ్యక్తం చేసింది. రాముడి విరాళాలను దొంగిలించడం తమను తీవ్రంగా బాధిస్తోందని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే విచారం వ్యక్తం చేశారు. తరతరాలుగా భక్తుల త్యాగాలు, అంకితభావం కారణంగా శ్రీరామ జన్మభూమిలోని ఈ భారీ ఆలయం రూపుదిద్దు కుందన్నారు. ఆలయ మొదటి పేజీ తరువాయి... నిర్వహణలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఒక ప్రత్యేకమైన అంశంగా పరిగణించి, ఆలయ నిర్వహణలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్దాలని హోసబలే శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను కోరారు. ఈ కేసులో దర్యాప్తు జరుగుతున్నందున నిందితులకు శిక్షపడే వరకు సంయమనం పాటించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనను అవకాశంగా తీసుకొని కొందరు వ్యక్తులు హిందూ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. రామమందిర విరాళాల దుర్వినియోగం కేసు నేపథ్యంలో రాజీనామా చేసిన అయోధ్య ఆలయ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రాలకు శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ షో-కాజ్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆలయ అధికారుల మధ్య జులై 6న జరగనున్న కీలక సమావేశంలో ఈ చర్యలు తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. విరాళాల అవకతవకలకు సంబంధించి లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని వారిని కోరనున్నట్లు తెలిపాయి. దర్యాప్తు అనంతరం వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో రామ్ మందిర్ విరాళాల వివాదంపై ఆర్ఎస్ఎస్ శుక్రవారం స్పందించింది. అయోధ్య హుండీల నుంచి డబ్బులు దొంగతనం చేయటంపై ఆర్ఎస్ఎస్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ సంఘటన ఎంతో బాధ కలిగించిందని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జనరల్ సెక్రటరీ దత్తాత్రేయ హొళసబలే న్యూఢిల్లీ నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో.. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు. ఆలయ నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని కోరారు. దేశ వ్యతిరేక శక్తుల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ ఘటన కోట్లాది మంది రామభక్తుల నమ్మకాన్ని, హిందూ సమాజం సెంటిమెంట్లను తీవ్రంగా గాయపరిచింది. ఈ ఘటన కారణంగా మేము తీవ్ర ఆవేదనకు, ఆగ్రహానికి గురయ్యాం. ఈ దురదృష్టకర సంఘటనను హిందూ వ్యతిరేక, దేశ వ్యతిరేక శక్తులు తమ స్వార్థం కోసం వాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. హిందూ సమాజంపై, సనాతన ధర్మంపై బురద జల్లడానికి ఈ వివాదాన్ని ఒక అస్త్రంగా మలచుకునే కుట్రలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఈ కష్టసమయంలో హిందూ సమాజమంతా ఎంతో ఓపికను, నిగ్రహాన్ని ప్రదర్శించాలి. ఎలాంటి తప్పుడు ప్రచారాలకు లోనుకాకుండా.. శత్రువుల కుట్రలను తిప్పికొట్టడానికి అందరూ ఐక్యమత్యంగా ఉండాలి. రామమందిరం ఎన్నో తరాల పోరాటాలు, కోట్లాది మంది త్యాగాల ఫలితంగా నిర్మితమైంది. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా ఆలయ ట్రస్ట్ పటిష్ఠమైన చర్యలు తీసుకుంటుందన్న నమ్మకం నాకు ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# లోయలో పడ్డ బస్సు..

**40మంది ప్రయాణికుల దుర్మరణం**

**ఇస్లామాబాద్, జులై 3 (ప్రభాత ఉదయం)**

పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు.. లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 40 మంది ప్రయాణికులు మరణించారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. పాకిస్థాన్ బలూచిస్థాన్ రాష్ట్రంలో షేరానీ జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న షేరానీ జిల్లా ఉన్నతాధికారులు, వైద్యులు, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను అత్యవసర చికిత్స కోసం ఝోబ్‌లోని ట్రామా సెంటర్‌కు తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటీవల జరిగిన అత్యంత ఘోర రోడ్డు ప్రమాదాల్లో ఇదీ కూడా ఒకటని అధికారులు తెలిపారు. సాంకేతిక లోపంతో ఓ బస్సు ఆగిపోయిందని, దీంతో అందులోని ప్రయాణికులను కూడా ఈ బస్సులోకి ఎక్కించారని అధికారులు చెప్పారు. దీంతో బస్సు ప్రయాణికులతో నిండిపోయిందన్నారు. ఈ ప్రమాదం జరిగిన బస్సు.. 36 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి బయలుదేరిందని పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభమైందని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

## అబద్ధాల లేఖలతో హరీష్ రావు

# ప్రచారం

మొదటి పేజీ తరువాయి...



చెప్పారు. ఈ మేరకు మంత్రి జూపల్లి శుక్రవారం సాయంత్రం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. సవాల్‌పై కట్టుబడి ఉన్నందునే ప్రెస్‌క్లబ్‌కు వచ్చానన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు కోసం ఎదురుచూస్తున్నానని తెలిపారు. తాను వెనుకడుగు వేసి పారిపోయే వ్యక్తిని కానన్నారు.. 'కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు 4 పేజీల చొప్పున లేఖలు రాశా. ముగ్గురికీ వాట్సాప్‌లోనూ ఆధారాలతో లేఖలు పంపించా. రూ.4.17 లక్షల కోట్ల అప్పు అంటూ హరీశ్ రిటర్న్ లేఖ పంపారు. రూ.8.21 లక్షల కోట్ల అప్పు అని లేఖలో చెప్పా. పారిపోవడం మా ఇంటావంటా లేదు. ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. లేఖలో తాను ప్రస్తావించినవి అబద్ధాలని నిరూపించ గలరా అని మంత్రి ప్రశ్నించారు. తాను చెప్పినవి అబద్ధాలైతే రాజీనామాకు సిద్ధం అంటూ పునరుద్ఘాటించారు. హరీశ్‌రావు సొల్లు పురాణం చెబుతున్నారు. నా ప్రశ్నలకు సమాధానం దాటవేస్తున్నారు. నేను అడిగింది ఏంటి? హరీశ్ చెప్పిందేంటి అని నిలదీసారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ కోసం 3 కుర్చీలు వేశాం. హరీశ్‌రావు రాసిన లేఖలో ఏమీ లేదు. ఇప్పటికైనా విలువలతో బతకండి' అని అన్నారు. కాగా, చర్చకు రావాలని పిలిచి పోలీసులతో అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల

# నటన అద్భుతం

మొదటి పేజీ తరువాయి...

నిర్ణయిస్తాం. కాంగ్రెస్, భారాస పాలనా వైఫల్యాలను ప్రజల ముందుంచేందుకు మేం సిద్ధం. మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి ఖర్చు చేసిన నిధులు, అందించిన సంక్షేమ కార్యక్రమాలపైనా చర్చిద్దాం. తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని సంజయ్ అన్నారు.




## సింధుజలాలపై పాక్ ప్రేలాపనలపై

# భారత్ మండిపాటు

**ఉగ్రవాదాన్ని ఎగదోయడం మానుకోండి**

**న్యూఢిల్లీ, జులై 3 (ప్రభాత ఉదయం)**

సింధు జలాల్లో తమ వాటా తీసుకొంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందంటూ పాక్ మంత్రి ముసాదిక్ మాలిక్ చేసిన వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. దాయాది దేశం ఉగ్రవాదాన్ని ఎగదోయడం, ఉగ్ర కార్యకలాపాలను ప్రోత్సహించడం మానుకొనే వరకు సింధు జలాల నిలిపివేత కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఉగ్రవాదం విషయంలో తమ వైఖరిలో ఎటువంటి మార్పు లేదని తేల్చి చెప్పింది. 1960లో ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో కుదిరిన ఈ ఒప్పందం చట్టబద్ధమైన నిబంధనలు కట్టుబడి ఉంటుందని తెలిపింది. దానిని ఏకపక్షంగా నిలిపివేయడం గానీ.. సవరించడం గానీ సాధ్యం కాదని పాక్‌కు చురకలు అంటించింది. సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడాన్ని పాక్ విడనాడాలని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ సూచించారు. సింధు జలాల నియంత్రణకు భారత్ యత్నిస్తోందని.. పాక్‌లోకి చుక్క నీరు కూడా ప్రవహించకుండా పొరుగు దేశ ప్రధాని అడ్డుకుంటున్నారని ఇటీవల పాక్ మంత్రి ముసాదిక్ ఆరోపించారు. తమ నీటి హక్కులకు ముప్పు వాటిల్లితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. మరో మంత్రి అట్టావుల్లా తరార్ మాట్లాడుతూ.. నీటి అంశం తమ దేశ జాతీయ భద్రతలో కీలక భాగమని పేర్కొన్నారు. సింధూ జలాల ఒప్పందం చట్టబద్ధంగా అమల్లోనే ఉందని, దాన్నెవరూ రద్దు చేయలేరంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. ఈ క్రమంలోనే విదేశాంగ శాఖ దీటుగా స్పందించింది. అఫ్గానిస్థాన్ పై పాకిస్థాన్ సైనిక దాడులను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. అఫ్గాన్ సార్వభౌమత్వానికి భారత్ మద్దతు కొనసాగిస్తుందని రణధీర్ జయస్వాల్ పునరుద్ఘాటించారు. మానవతా సాయం, అభివృద్ధి ప్రాజెక్టుల ద్వారా ఆ దేశంతో సంబంధాలు కొనసాగుతున్నాయన్నారు. ఇటీవల వెనెజువెలాలో అనుమానాస్పద స్థితిలో భారత నావికుడు రాకేశ్ చౌహాన్ మృతిచెందిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. మృతదేహంలో అవయవాలు మాయం కావడం గురించి అక్కడి అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపింది.

## బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న రుణాలు

# రూ.4.17 లక్షల కోట్లే

మొదటి పేజీ తరువాయి...

తమ లెక్కలను మార్చడం లేదని, కాంగ్రెస్ మాత్రం సందర్భానుసారంగా అప్పుల అంకెలను మారుస్తోందని విమర్శించారు. తమ అంచనాల ప్రకారం వివిధ మార్గాల ద్వారా ప్రస్తుత ప్రభుత్వం సుమారు రూ.4.5 లక్షల కోట్ల అప్పులు చేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ అంశానికి సంబంధించిన అసెంబ్లీ వీడియోలు, ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలు, ఆర్బీఐ అధికారిక గణాంకాలను మంత్రి జూపల్లి వాట్సాప్‌కు పంపినట్లు తెలిపారు. వాటిని పరిశీలించి వాస్తవాలను తెలుసుకోవాలని కోరిన హరీశ్‌రావు, ఇకనైనా అప్పుల అంశంలో తప్పుడు ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు.

## దేశంలో తొలిసారిగా

# ఇడి సంచలన నిర్ణయం

**స్వాధీనం చేసుకున్న విమానం వేలం**

**న్యూఢిల్లీ, జులై 3 (ప్రభాత ఉదయం)**




దేశంలోనే తొలిసారిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ స్వాధీనం చేసుకున్న ఓ విమానాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించింది. హైదరాబాద్ జోనల్ ఈడీ స్వాధీనం చేసుకున్న హాకర్ 800 విమానాన్ని విక్రయించేందుకు ఈ నెల 1న ఎంఎస్‌టీసీ ద్వారా ఆక్షన్ నిర్వహించగా.. రూ.3 కోట్లకు అమ్ముడుపోవడం విశేషం. హాకర్ 800 విమానం అనేది అంతకుముందు ఫాల్కన్ పోంజీ కేసు ప్రధాన నిందితుడు అమర్‌దీప్ కుమార్‌కు చెందినది. అయితే అమర్‌దీప్ నకిలీ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో రూ.792 కోట్ల మోసానికి పాల్పడినట్టు ఈడీ తేల్చింది. దర్యాప్తులో భాగంగా ఈ విమానాన్ని గత మార్చి 7న ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత.. చట్టపరమైన ప్రక్రియ ద్వారా, పీఎంఎల్ఏ అడ్జుడికేటింగ్ అథారిటీ అనుమతితో దీనిని ఈ-వేలంలో రూ.3 కోట్లకు విక్రయించారు. ఈ సొమ్మును బాధిత పెట్టుబడిదారులకు తిరిగి చెల్లించనున్నారు. కాగా.. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్ట్ అవ్వగా, దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు ఈడీ తెలిపింది. అయితే.. ఈడీ స్వాధీనం చేసుకున్న విమానాన్ని పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో విక్రయించడం దేశంలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఆస్తుల విక్రయ ప్రక్రియలో పారదర్శకత, పోటీ వాతావరణం కల్పించడం సహా ప్రభుత్వ ఆదాయాన్ని మరింత పెంచే దిశగా ఈ విధానం ఉపయుక్తమవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

మొదటి పేజీ తరువాయి...

సూచించారు. "వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రాంతం ఏర్పడింది. ఇది సగటున 7.4 కి.మీ ఎత్తు వరకు ఉండి ఆ ఎత్తు పెరిగే కొద్ది ఇది నైరుతి దిక్కుకి వాలి ఉంది. దాని వల్ల ఉత్తర తెలంగాణలో ఇవాళ, రేపు భారీ వర్షాలు , పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కూడా కురిసే అవకాశం ఉంది. ఈసారి అల్పపీడనం ఏర్పడినట్లయితే ఎక్కువగా వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది. పలు జిల్లాలకు ఇవాళ భారీ వర్ష సూచన జారీ చేశాం. రేపు, ఎల్లుండి పలు జిల్లాలకు అతి భారీ వర్షాలు పడనున్నాయి. మొత్తంగా ఉత్తర తెలంగాణకు మూడు రోజుల వరకు భారీ, అతి భారీ వర్ష సూచన ఉంది" - శ్రీనివాస్ రావు, వాతావరణశాఖ అధికారి దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్ తో పాటు నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. రేపు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. అలాగే కామారెడ్డి, మెదక్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబ్ బాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు తెలిపారు ఈ నెల 7 తరువాతే : ఆదివారం అదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ చేయగా, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. ఇక హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమై తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి రాష్ట్రంలో పొడి బారిన వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు.

# ఎరువులు, విత్తనాల దుకాణాల ఆకస్మిక తనిఖీ

**రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలి**

**ఎం ఆర్ పి కంటే ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తప్పవు: డిప్యూటీ కలెక్టర్ జి. రాజ్ కుమార్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 3(ప్రభాత ఉదయం)కేటిదొడ్డి**

మండల కేంద్రంలోని ఎరువులు మరియు విత్తనాల విక్రయ కేంద్రాలను (డీలర్ షాపులను) శుక్రవారం డిప్యూటీ కలెక్టర్ జి. రాజ్ కుమార్, తహసీల్దార్ కరుణాకర్ మరియు మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్ సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ దుకాణాలలో ఉన్న ఎరువులు, విత్తనాల నిల్వలు (స్టాక్), విక్రయ రికార్డులు , లైసెన్సులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డుల ప్రకారం స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ...డీలర్లు ఎవరైనా రైతులకు విక్రయించే ఎరువులు, విత్తనాలను గరిష్ట చిల్లర ధర కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి దుకాణంలో స్టాక్ బోర్డులను ప్రదర్శించాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు.




రైతులకు కేవలం నాణ్యమైన, ధృవీకరించబడిన వ్యవసాయ ఉత్పాదకాలను మాత్రమే అందుబాటులో ఉంచాలని సూచించారు.నానో ఎరువులతో పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలి:అనంతరం మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు పంటలలో రసాయనిక ఎరువులను ఇష్టానుసారంగా వాడకుండా, సమతుల్య ఎరువుల వినియోగం చేపట్టాలన్నారు. సాంప్రదాయ ఎరువులతో పాటు నానో ఎరువులను (నానో యూరియా, నానో డి.ఎ.పి) ఉపయోగించడం ద్వారా ఎరువుల వినియోగ సామర్థ్యం పెరిగి, పంట పెట్టుబడి ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని వివరించారు. రైతులందరూ వ్యవసాయ శాఖాధికారుల సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి లాభసాటి వ్యవసాయం చేయాలని ఈ సందర్భంగా అధికారులు విజ్ఞప్తి చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో వ్యవసాయ , రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ, దివంగత సిలివేరి ప్రహ్లాద్ మార్గదర్శకాలతో...

# చేనేత కార్మికులకు అండగా నిలుస్తాం : వరకాల ప్రమీల

**భద్రావతి చేనేత సహకార సంఘం నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రమీల.లిప్రధాన కార్యదర్శిగా పాశికంటి రమేష్- కోశాధికారిగా పగిడిమర్రి సూర్యనారాయణ ఏకగ్రీవం.**

**రాజేంద్రనగర్ , జూలై 3 (ప్రభాత ఉదయం)**



చేనేత సహకార సంఘాల అభ్యున్నతికి కృషిచేసిన దివంగత శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళతామని శ్రీ భద్రావతి చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గం స్పష్టం చేసింది. దశాబ్దాలపూర్వమే చేనేతలకు ఉపాధి, వారి కుటుంబాల ఆర్థిక అభివృద్ధిని కాంక్షిస్తూ సొసైటీ వ్యవస్థాక సభ్యులుగా కొనసాగిన ప్రముఖ తెలంగాణ ఉద్యమ నాయకుడు దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ, దివంగత సిలివేరి ప్రహ్లాద్ మార్గదర్శకాలతో శ్రీ భద్రావతి హ్యాండ్లూమ్ కో-ఆపరేటివ్ సొసైటీ కి వన్నె తీసుకు వస్తామని వారు తెలిపారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖ సీనియర్ ఇన్స్పెక్టర్, ఎన్నికల అధికారి విజయసింహ ఆధ్వర్యంలో నూతన పాలక మండలి ఎన్నికలు జరిగాయి. సుల్తాన్ షాహి, గౌలిపుర, లాల్ దర్వాజా, ఉప్పుగూడ కాటేదాన్ మార్కండేయ నగర్, రక్షాపురం, దూద్ బౌలి ప్రాంతానికి చెందిన చేనేత కార్మికులు నూతన కార్యవర్గం ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలలో శ్రీ భద్రావతి హ్యాండ్లూమ్ కో- ఆపరేటివ్ రివర్స్ (ఉత్పత్తి , విక్రయం) సొసైటీ నూతన చైర్ పర్సన్ గా వరకాల ప్రమీల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నాడెపు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పాశికంటి రమేష్, కోశాధికారిగా పగిడిమర్రి సూర్యనారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.. అలాగే సొసైటీ డైరెక్టర్లుగా వి. యాదగిరి, సామల పెంటయ్య, వరకాల భాస్కర్, కె.శ్రావణ్, వి . యామినిసౌభాగ్యము నియమితులయ్యారు. ఈ సందర్భంగా సొసైటీ నూతన అధ్యక్షురాలు వరకాల ప్రమీల మాట్లాడుతూ పాతబస్తీ సుల్తాన్ షాహిలోని అతి పురాతనమైన తమ సొసైటీకి ఆదరణ లేక గత కొంతకాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సొసైటీలకు ఎన్నికలు నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. గుర్తింపు పొందిన సొసైటీల ద్వారా చేనేతలకు ఆర్థికపరంగా కూడా సహకారం ప్రభుత్వం ద్వారా అందించాలని కోరారు. చేనేత రంగ అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. భవిష్యత్తులో భద్రావతి చేనేత సహకార సంఘం ఆదర్శంగా తీర్చిదిద్దడానికి నూతన పాలకవర్గంతో తన వంతు కృషి చేస్తారని వెల్లడించారు. సొసైటీ ద్వారా చేనేత కార్మికుల కావలసిన సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నూతన పాలక మండలి ప్రతినిధులను చేనేత కార్మికులు ఘనంగా సన్మానించారు. నూతన కార్యవర్గం క్రియాశీలకంగా పనిచేసి నిరుపేద నేత కార్మికుల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాలని వారు కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజి రెడ్డి

## కృషి విజ్ఞాన కేంద్రాలు మినీ విశ్వవిద్యాలయాలుగా అభివృద్ధి చెందాలి: డాక్టర్ రాజిరెడ్డి

**బుద్వేల్, జూలై 3 (ప్రభాత ఉదయం)**

ఎల్ నీ నో నేపథ్యంలో కృష్ణా, గోదావరి జలాశయాల నీటి మట్టం సైతం తగ్గే అంచనాలు ఉన్న నేపథ్యంలో తక్కువ నీటితో సాగయ్యే పంటలైన కూరగాయలు, తృణధాన్యాలు, నూనె గింజలు, అవరాలను సాగు చేసుకోవాలని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల వేదిక గా తెలంగాణ లోని 16 కృషి విజ్ఞాన కేంద్రాలు నిర్వహించిన యాన్యువల్ యాక్షన్ ప్లాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో ఐదు పంటలు ప్రధానంగా సాగు అయ్యేవని, కానీ నేడు కేవలం వరి, పత్తికి మాత్రమే పరిమితమయ్యాయని ఆయన అన్నారు. దానితో ఇతర పంటల ధరలు విపరీతంగా పెరిగాయని ఆయన పేర్కొన్నారు. ఎల్ నీ నో నేపథ్యంలో ఈ పంటలు వర్షపాతాలలో హెచ్చు తగ్గులు తట్టుకోలేవని, అందువల్ల పర్యావరణ సహిత పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని ఆయన కోరారు. ఎల్ నీ నో ప్రభావాన్ని సానుకూలంగా మలుచుకోవడానికి ఉద్యాన పంటలను విస్తారంగా ప్రోత్సహించాలని ఆయన అన్నారు. ముఖ్యంగా సమగ్ర సాగు వ్యవస్థలను నెలకొల్పినట్లయితే వ్యవసాయ, ఉద్యాన, పాడి పెరిగి రైతులకు నికర లాభాలు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కృషి విజ్ఞాన కేంద్రాలు మినీ విశ్వవిద్యాలయాలుగా ఎదగాలని డాక్టర్ దండ రాజిరెడ్డి అభిప్రాయపడ్డారు. ఆధునిక సాగు పరిజ్ఞానాన్ని రైతులకు చేర్చడంలో కృషి విజ్ఞాన కేంద్రాల పాత్ర ముఖ్యమైనదని అటారీ జోన్ – 10 డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా అన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలలో స్థానిక, దేశీ × రకాలను సాగులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎ భగవాన్, డీన్ ఆఫ్ అగ్రికల్చర్, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ జె చీనా, ప్రొఫెసర్ జయశం కర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ యాకాద్రి, పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ కిషన్, విస్తరణ విభాగం సంచాలకులు డాక్టర్ టి సురేశ్ కుమార్, పరిశోధన విభాగం సంచాలకులు డాక్టర్ డి లక్ష్మీనారాయణ, విశ్వవిద్యాలయం గ్రంథాలయ అధికారి డాక్టర్ ఎం రాజశేఖర్, వెజిటేబుల్ రీసెర్చ్ స్టేషన్ అధిపతి డాక్టర్ డి అనిత, రామగిరి జిల్లా కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ రమేశ్ లతో పాటు కేవీకే ల కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.




తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల విజయలక్ష్మీ ని శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ టీచర్స్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు నందిగామ నర్సింహ్మ ఆమె కార్యాలయం లో మర్యాద పూర్వకంగా కలిశారు. కాలనీ ప్రజలతో కలసి వెళ్లిన ఆయన కాలనీ లో నెల కొన్న సమస్యలను గద్వాల విజయలక్ష్మి కి వివరించారు.

- బుద్వేల్, ప్రభాత ఉదయం

## కొండాపురంలో హాకా రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ డీకే అరుణ






**గద్వాల జిల్లా ప్రతినిధి,జూలై 3 (ప్రభాత ఉదయం)**

కేటిదొడ్డి మండలం కొండాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన హాకా ఫార్మర్స్ సర్వీస్ సెంటర్ ను మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... డీసీఎంఎస్, రైతు సేవా కేంద్రాల మాదిరిగానే హాక సర్వీస్ సెంటర్ ద్వారా వ్యవసాయ సేవలు అందుతాయని తెలిపారు. రైతులు హాక సర్వీస్ సెంటర్లను వినియోగించుకొని వ్యవసాయ సేవలు పొందాలని సూచించారు. రైతులకు అవసరమైన సేవలు ఒకే చోట అందుబాటులో ఉండేందుకు రైతు సేవ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. హక రైతు సేవా కేంద్రాలను వినియోగించుకొని వ్యవసాయ సేవలను పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హాకా రైతు సేవా కేంద్రం నిర్వాహకుడు ఎర్ర భీం రెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మేంబర్ బండల వెంకట రాములు, జిల్లా కోశాధికారి మిర్జాపురం రామచంద్ర రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు దరూర్ కిష్టన్న ,మండల అధ్యక్షుడు శ్రీపాద రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు అనిమిరెడ్డి, కేటి దొడ్డి మండలం ఓ బి సి ప్రెసిడెంట్ ముంగిలి వీరేష్ రెడ్డి , ఉప సర్పంచ్ బీమ్ రెడ్డి, నాయకులు రజక నరసింహ, దేవేందర్ రెడ్డి, రఘు గౌడ్, తిమ్మప్ప, సూర్యకాంతరెడ్డి, హనుమంతు, రంగా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను బహుకరిస్తున్న తెలంగాణ అగ్రికల్చర్ సైంటిస్ట్ అసోసియేషన్ (టాసా) ప్రధాన కార్యదర్శి డాక్టర్ సల్లా సౌజన్య, ఉపాధ్యకులు డాక్టర్ జె కమలాకర్ లు

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు అభినందనలు తెలిపిన టాసా ప్రతినిధులు

**బుద్వేల్, జూలై 3 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ను శుక్రవారం సచివాలయంలో తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్ (టాసా) ప్రధాన కార్యదర్శి డాక్టర్ సల్లా సౌజన్య, ఉపాధ్యక్షులు డాక్టర్ జె కమలాకర్ లు మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సైంటిస్ట్ అసోసియేషన్ సభ్యుల తరపున ఆయనకు అభినం దనలు తెలియజేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సమర్థ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో, ముఖ్యంగా వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి సాదించాలని ఆకాంక్షించారు. వ్యవసాయ పరిశోధనలు, విస్తరణ సేవలు, రైతుల సంక్షేమం, వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తు, భవిష్యత్తులో కూడా విశ్వవిద్యాలయం, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని కోరారు. రాష్ట్రంలో వ్యవసాయరంగాభివృద్ధికి శాస్త్రవేత్తల సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు.



**రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె లక్ష్మణ్ హైదరాబాద్ చేరుకున్న సందర్భంగా శుక్రవారం ఆయనకు బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన తోకల శ్రీనివాస్ రెడ్డి శంషాబాద్ విమానాశ్రయంలో కలసి అభినందనలు తెలియజేశారు.**

- బుద్వేల్, ప్రభాత ఉదయం



పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామీ, గోవిందమాంబ కల్యాణ మహోత్సవ వేడుకలో పాల్గొన్న బీజేపీ నాయకులు వై శ్రీధర్ తదితరులు

## బుద్వేల్‌లో ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబల కళ్యాణం

**బుద్వేల్, జూలై 3 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ లో గల శ్రీ శివ పోతులూరి వీరబ్రహ్మంగారి మఠం లో శుక్రవారం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. వందలాది మంది భక్తులు ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. దేవాలయం 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం 7 గంటలకు గణపతి పూజ, పుణ్య హావాచనం, గరుడ స్థంబ పూజ, పంచలింగ పూజ, స్వామివారికి అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సం ఖ్యలో పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాత్రి భజన కార్యక్రమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమంలో బీజేపీ గోల్కొండ గోషామహల్ జిల్లా ఇంచార్జి వై.శ్రీధర్, దేవాలయ చైర్మన్ జె సత్యనారాయణ, కార్యదర్శి జి శ్రీనివాస్, కోశాధికారి రాము గౌడ్, వేణు, వీర నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.




ఎన్ సీ సీ – బి సర్టిఫికెట్ లు తీసుకున్న రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

## రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన 24 మందికి ఎన్ సీ సీ - బి సర్టిఫికెట్ లు

**బుద్వేల్, జూలై 3 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్న 24 మంది విద్యార్థులు ఎన్సీసీ బి సర్టిఫికెట్ ను అందుకున్నారు. రాజేంద్రనగర్ లోని 1 (తెలంగాణ) ఆర్ అండ్ వి రెజిమెంట్ ఎన్ సీ సీ లో వీరందరు 2024–26వ సం వత్సరంలో ఎన్సీసీ పూర్తి చేశారు. 12 మంది విద్యార్థినీలు, 12 మంది విద్యార్థులకు 1 (తెలంగాణ) ఆర్ అండ్ వి రెజిమెంట్ ఎన్సీసీ కమాండింగ్ ఆఫీసర్ శేఖవత్ ఎన్ సీ సీ – బి సర్టిఫికెట్లను బహుకరించారు. ఈ కార్యక్రమంలో 1 (తెలంగాణ) ఆర్ అండ్ వి రెజిమెంట్ ఎన్ సీ సీ అధికారులు తివారి, మురళి, సంతోష్, చంద్రశేఖర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. బి సర్టిఫికెట్ పొందిన విద్యార్థులను రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి అభినందించారు.

# కొల్లూరులో సీవరేజ్ సమస్యపై సీఎంసీ కమిషనర్, జలమండలి ఎండీ జాయింట్ ఇన్స్పెక్షన్

**సమగ్ర సీవరేజ్ మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఆదేశం**

**సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజనతో కలిసి పరిశీలలి**

**హైదరాబాద్, జూలై 3 (ప్రభాత ఉదయం)**




కొల్లూరు ప్రాంతంలో సీవరేజ్ వర్షపు నీటి కాలువ ద్వారా చెరువు, వ్యవసాయ భూముల్లోకి చేరుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి శుక్రవారం సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన తో కలిసి సంబంధిత అధికారులతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా.. కొల్లూరు లోని ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్ హౌసింగ్ కాలనీలోని 9 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ పనిచేయకపోవడంతో శుద్ధి చేయని మురుగునీటిని సమీప చెరువు, వర్షపు నీటి కాలువలోకి మళ్లిస్తున్నట్లు గుర్తించారు. అలాగే కొల్లూరు ప్రాంతంలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా సీవరేజ్ వ్యవస్థ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా హౌసింగ్ శాఖ నిర్వహణలో ఉన్న 9 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం సంబంధిత అధికారులకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఎండీ ఆదేశించారు. అలాగే కొల్లూరు, పరిసర ప్రాంతాలకు సీవరేజ్ మాస్టర్ ప్లాన్ ప్రణాళికను రూపొందించి, ప్రధాన ట్రంక్ సీవర్ మెయిన్ ఏర్పాటు ద్వారా మొత్తం మురుగునీటిని సేకరించే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. వర్షపు నీటి కాలువలపై ఉన్న ఆక్రమణలను గుర్తించి హద్దులు నిర్ధారించాలని, నీటిపారుదల, రెవెన్యూ శాఖలతో కలిసి సంయుక్త సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త ఎస్‌టీపీ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భూమిని గుర్తించి భూ కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కొల్లూరు ప్రాంతంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో కార్యాచరణ చేపట్టనున్నట్లు జలమండలి ఎండీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎస్‌టీపీ సీజీఎం సుజాత, ప్రాజెక్టు, ఓఎం డివిజన్ అధికారులు, హౌసింగ్, నీటిపారుదల శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అమ్మ ఒడిలోంచి పసిగుడ్డు అపహరణ.. కోల్‌కతాకు అమ్మేసిన కేటుగాళ్లు!

## రెక్కలొచ్చిన చందానగర్ ఖాకీలు: 72 గంటల్లోనే కిడ్నాపర్ల ఆటకట్టించి, చిన్నారిని తల్లికి అప్పగించిన పోలీసులు

**శేరిలింగంపల్లి : జూలై 3, (ప్రభాతఉదయం)**

కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన కన్నతల్లి ఒడిలోనే ఆ పసికందు నిద్రిస్తోంది. కానీ డబ్బు పిచ్చి ముదిరిన కొందరు కిరాతకులకు ఆ అమాయకత్వం కనిపించలేదు. అర్ధరాత్రి వేళ అమ్మ గుండెలపై నుంచి ఆ నెల రోజుల ఆడబిడ్డను గుంజుకెళ్లారు. హైదరాబాద్‌లో కిడ్నాప్ చేసి, ఫ్లైట్ ఎక్కి వచ్చిన పశ్చిమ బెంగాల్ మహిళకు రూ.1.50 లక్షలకు అమ్మేశారు. కానీ ఆ తల్లి కన్నీటి రోదనలు వృధా పోలేదు. సైబరాబాద్ పోలీసులు డేగకళ్లతో నిందితులను వెంటాడారు. కోల్‌కతాకు ఆ బిడ్డను తరలించేలోపే కిడ్నాపర్ల ఆటకట్టించి, చిన్నారిని క్షేమంగా తీసుకొచ్చి మళ్లీ అమ్మ ఒడికి చేర్చారు. అంతర్రాష్ట్ర శిశు విక్రయాల ముఠా గుట్టురట్టు చేసిన ఈ హృదయవిదారక ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది.

సైబరాబాద్ కమిషనరేట్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేసంతో నిందితుల వివరాలను సీపీ ఎం. రమేష్ వివరించారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన మాలన్ బౌరవ్ శాంత బాయి సర్కస్ కార్మికురాలు. బతుకుదెరువు కోసం హైదరాబాద్ వచ్చిన ఆమె, తన సర్కస్ బృందంతో కలిసి లింగంపల్లి రైల్వే స్టేషన్ ముఖద్వారం పక్కన ఉన్న ఫుట్‌పాత్‌పై తాత్కాలికంగా నివాసం ఉంటోంది. జూన్ 30వ తేదీ తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో ఆమె తన నెల రోజుల ఆడబిడ్డను ఒళ్లో వేసుకుని నిద్రిస్తోంది. అదే సమయంలో ఆటోలో వచ్చిన కొందరు దుండగులు ఒక్కసారిగా ఆ పసికందును లాక్కుని పారిపోయారు. బిడ్డ ఏడుపు విని ఉలిక్కిపడి లేచిన ఆ తల్లి.. ఆటో వెనుక పరిగెత్తినా




కిడ్నప్ కు గురైన చిన్నారిని తల్లికి అప్పగిస్తున్న సైబరాబాద్ పోలీసు కమిషనర్ ఎం. రమేష్...

లాభం లేకపోయింది. కన్నీరు మున్నీరవుతూ ఆమె చందానగర్ పోలీసులను ఆశ్రయించింది..కేసు నమోదు చేసుకున్న చందానగర్ పోలీసులు రంగంలోకి దిగారు. విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కోల్‌కతాకు చెందిన రహనుమా అలీ (30) అనే మహిళకు పెళ్లై ఐదేళ్లయినా పిల్లలు లేరు. దీంతో హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఉంటున్న తన పిన్ని నిమ్మీ జహాన్ ద్వారా ఒక బిడ్డను ఏర్పాటు చేయాలని కోరింది. నిమ్మీ ఈ విషయాన్ని నేరేడ్‌మెట్‌కు చెందిన నాజియాకు చెప్పగా, నాజియా తన కాబోయే భర్త జుబేర్‌కు చేరవేసింది. పెద్ద మొత్తంలో డబ్బు వస్తుందని ఆశపడిన జుబేర్ వికారాబాద్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఇర్ఫాన్‌తో కలిసి కిడ్నాప్ ప్లాన్ వేశాడు.

లింగంపల్లి ఫుట్‌పాత్‌పై పడుకున్న పసికందును టార్గెట్ చేసి జూన్ 30న కిడ్నాప్ చేశారు. బిడ్డ దొరికిందని తెలియగానే కోల్‌కతా నుంచి రహనుమా అలీ జూలై 1న ఫ్లైట్ ఎక్కి హైదరాబాద్ వచ్చింది. ఆన్‌లైన్ ద్వారా రూ. 1,50,000 నగదును జుబేర్ ఖాతాలోకి బదిలీ చేసి, పాపను స్వాధీనం చేసుకుంది.

**మూడు రోజుల వేట.. ముఠా అరెస్ట్!**

పాపను తీసుకుని కోల్‌కతాకు పారిపోయేందుకు ముఠా సిద్ధమవుతుండగా.. సైబరాబాద్ పోలీసులు ఊహించని షాక్ ఇచ్చారు. ఆర్సీపురం ఏసీపీ సీహెచ్. వై. శ్రీనివాస్ ఆధ్వర్యంలో చందానగర్ ఇన్‌స్పెక్టర్ ఎస్. విజయ్, అమీన్‌పూర్ డీఐ సత్యనారాయణ, చందానగర్ డీఐ ఎన్. భాస్కర్ మూడు బృందాలుగా విడిపోయారు. సైబరాబాద్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ సిటీ పరిధిలోని వందలాది సీసీటీవీ కెమెరాలను రాత్రింబవళ్లు స్క్రీనింగ్ చేశారు. 72 గంటల పాటు శ్రమించి క్లూస్ సంపాదించి, ఐదుగురు నిందితులను మహమ్మద్ జుబేర్, మహమ్మద్ ఇర్ఫాన్, సాదిఖా మక్సూద్ అలియాస్ నాజియా, నిమ్మీ జహాన్, రహనుమా అలీలను అదుపులోకి తీసుకున్నారు.

**అమ్మ ఒడికి చేరిన 'లక్ష్మి'..**

నిందితుల నుంచి నెల రోజుల పాపను సురక్షితంగా రక్షించిన పోలీసులు, సైబరాబాద్ కమిషనర్ రమేష్ చేతుల మీదిగా పసి కందును కన్నతల్లి మాలన్ బౌరవ్ శాంత బాయికి అప్పగించారు. రోజుల తరబడి ఆకలితో, ఏడుపుతో అల్లాడిపోయిన ఆ బిడ్డను తిరిగి గుండెలకు హత్తుకున్న ఆ తల్లి ఆనంద బాష్పాలు రాల్చింది. పోలీసులకు చేతులెత్తి నమస్కరించింది. సకాలంలో స్పందించి కిడ్నాపర్ల నెట్‌వర్క్‌ను ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో శేర్లింగంపల్లి జోన్ డిసిపి శ్రీనివాస్, ఏసిపి శ్రీనివాస్ కుమార్, సీఐ సుంకర విజయ్తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం: ఎమ్మెల్యే జిఎంఆర్

**కొత్తకోట, జూలై 3 (ప్రభాత ఉదయం)**

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని త్వరలోనే ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని కూడా అమలు చేయనున్నట్లు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తకోట మండలం రాయినిపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన కిచెన్ షెడ్ ప్రారంభోత్సవం,అలాగే అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథులు గా హాజరై కిచెన్ షెడ్ ప్రారంభించి, నూతన తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రస్తుతం అధిక డిమాండ్ ఉందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని కూడ అమలు చేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు పోషకాహారం అందించి వారి ఆరోగ్యంతో పాటు విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాయిని పేట పాఠశాలకు జిల్లా కలెక్టర్ తన నిధుల నుంచి రూ.23.80 లక్షలు మంజూరు చేసి పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని, ఇందుకు ప్రత్యేకంగా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పాఠశాల స్థాయి నుంచే కృత్రిమ మేధస్సు విద్యను కూడా ప్రవేశపెట్టే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాయిని పేట ప్రభుత్వ పాఠశాలలో సమర్థవంతమైన ఉపాధ్యాయ బృందం పనిచేస్తోందని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను మరింత సమర్థవంతంగా వినియోగించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంపొందించాలని తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు కూడా ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, రాయినిపేట సర్పంచ్ భాగ్యలక్ష్మి, డి ఎస్ ఓ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సినిమా స్టైల్లో పరారీ..

# అంతకంటే స్పీడ్‌గా అరెస్ట్!

## హర్యానాలో 'నార్సింగి' గంజాయి నిందితుడు ముజఫర్ గుట్టురట్టు!!

## సైబరాబాద్ పోలీసుల 'స్మార్ట్' ఆపరేషన్: బాత్‌రూమ్ అద్దాలు పగలగొట్టి పారిపోయిన నిందితుడు హర్యానాలో చిక్కాడు!

**శేరిలింగంపల్లి : జూలై 4, (ప్రభాత ఉదయం)**

పోలీస్ కస్టడీ నుంచి అత్యంత నాటకీయంగా తప్పించుకుని పారిపోయిన అంతర్రాష్ట్ర గంజాయి నిందితుడి ఆటను సైబరాబాద్ పోలీసులు కేవలం కొద్దిరోజుల్లోనే ముగించారు. టెక్నాలజీని అందిపుచ్చుకుని, డేగకన్నుతో నిందితుడి కదలికలను పసిగట్టిన ప్రత్యేక బృందాలు హర్యానా సరిహద్దుల్లో నిందితుడిని అతడి భార్యను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఎంత స్మార్ట్‌గా పారిపోయినా అంతకంటే హైటెక్ వేగంతో వేటాడి పట్టుకున్న సైబరాబాద్ పోలీసుల తీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ (సీపీ) రమేష్ విలేకరుల సమావేశం లో వెల్లడించారు.

సినిమా ఫక్కీలో పోలీస్ కస్టడీ నుండి రెండు రోజుల క్రితం కరుడుగట్టిన గంజాయి స్మగ్లింగ్ నిందితుడు పరారయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి సైబరాబాద్ కమిషనర్లు ఏర్పాటు చేసిన సమావేశంలో సిపి డాక్టర్ ఎం. రమేష్ నిందితులను వెల్లడించారు. నార్సింగి పోలీసులు ఒక భారీ గంజాయి ముఠా గుట్టురట్టు చేసి, అందులో కీలక సూత్రధారి అయిన ముజఫర్ అనే అంతర్రాష్ట్ర నిందితుడిని అరెస్ట్ చేశారు. విచారణ నిమిత్తం అతడిని స్టేషన్‌లో ఉంచగా సినిమా ఫక్కీలో పోలీసుల కన్నుగప్పి బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు. అక్కడ ఉన్న కిటికీ అద్దాలను పగలగొట్టి, అత్యంత నాటకీయంగా పోలీస్ కస్టడీ నుంచి పరారయ్యాడు. పోలీస్ స్టేషన్ నుంచే నిందితుడు తప్పించుకోవడంతో సైబరాబాద్ పోలీస్ యంత్రాంగం దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

నిందితుడి పట్టుకునేందుకు సీపీ రమేష్ ఆదేశాల మేరకు తక్షణమే రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని (టెక్నాలజీ) ఉపయోగించాయి. నిఘా వర్గాల నుంచి అందిన సమాచారంతో నిందితుడి కదలికలపై నిరంతరం నిఘా పెట్టారు. ఈ క్రమంలో నిందితుడు ముజఫర్ తన భార్యతో కలిసి ఢిల్లీకి పారిపోతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది.

వెంటనే అప్రమత్తమైన సైబరాబాద్ స్పెషల్ టీమ్స్ నిందితుడిని వేటాడాయి. చివరకు హర్యానా సరిహద్దుల్లో నిందితుడిని, అతడి భార్యను విజయవంతంగా అదుపులోకి తీసుకుని, హైదరాబాద్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

**తప్పు చేస్తే ఎంతటి వారైనా వదిలేదే లేదు: సీపీ రమేష్**

నిందితుడు ఎంతటి చాకచక్యంగా తప్పించుకున్నా అంతే వేగంగా సాంకేతికతను ఉపయోగించి హర్యానాలో పట్టుకోవడం జరిగింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై, డ్రగ్స్ ముఠాలపై కఠిన చర్యలు ఉంటాయి. అలాగే ఈ కేసుకు సంబంధించి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై కూడా అంతర్గత విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని కమిషనర్

హెచ్చరించారు. పారిపోయిన నిందితుడిని పట్టుకోవడంలో ప్రాణాలు పణంగా పెట్టి రాత్రింబవళ్లు శ్రమించి హర్యానా సరిహద్దుల వరకు వెళ్లి నిందితుడిని పట్టుకొచ్చిన ప్రత్యేక బృందాన్ని, నార్సింగి పోలీసులను సీపీ రమేష్ ప్రత్యేకంగా అభినందించారు.

### ఓటర్ల నుంచి సేకరించిన వివరాలను బీఎల్‌ఓ యాప్‌లో

# ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలి

## ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలి

## ఎల్.బి.నగర్‌లో ఎన్యుమరేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూలై 3 (ప్రభాత ఉదయం)**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్ల నుంచి ఎన్యుమరేషన్ ఫారాల ద్వారా సేకరించిన వివరాలను బీఎల్ఓ యాప్‌లో స్పష్టంగా, ఖచ్చితంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎల్.బి.నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు వార్డుల్లో కొనసాగుతున్న ఇంటింటి ఎన్యుమరేషన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఎల్.బి.నగర్ జోనల్ అధికారి వికాస్ మహతో తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జిల్లాలో జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి ఎన్యుమరేషన్ కార్యక్రమం కొనసాగుతోందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయడంతోపాటు ఆ వివరాలను వెంటనే బీఎల్ఓ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఓటర్లు పూర్తి చేసిన ఫారాలను సేకరించి, అందులో



పొందుపరిచిన వివరాలను యాప్‌లో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు, నకిలీ నమోదులు లేదా అనర్హుల పేర్లు లేకుండా అత్యంత పారదర్శకంగా, విశ్వసనీయంగా ఓటరు జాబితాను రూపొందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న సర్వే విధానం, ఫారాల పంపిణీ, యాప్‌లో నమోదు ప్రక్రియ, పూర్తి చేసిన ఫారాల సేకరణ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా అత్యంత కీలకమైన ఆధార పత్రంగా ఉంటుందని పేర్కొన్న కలెక్టర్, ప్రతి నమోదు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మరణించిన ఓటర్ల పేర్లను సంబంధిత ఆధారాలతో తొలగించడం, ఒకే వ్యక్తికి రెండు లేదా అంతకంటే ఎక్కువ ఈపీఐసీ కార్డులు ఉన్నట్లయితే వాటిని గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవడం, నివాసం మారిన వారి వివరాలను సక్రమంగా నవీకరించడం వంటి అంశాలను అత్యంత బాధ్యతతో నిర్వహించాలని తెలిపారు. ప్రతి అర్హుడికి ఒకే ఓటరు గుర్తింపు కార్డు ఉండేలా చర్యలు చేపట్టి, ఖచ్చితమైన, తప్పులేని, పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించడమే ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనలో బీఎల్ఓలు కీలక పాత్ర పోషిస్తున్నందున వారు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలకు కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాలను నింపే సమయంలో ఓటర్లు సరైన వివరాలను అందించాలని, అవసరమైన పత్రాలను జతచేయాలని, అధికారులు కోరిన సమాచారాన్ని పూర్తిగా అందించడం ద్వారా ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. బీఎల్ఓ యాప్‌లో నమోదయ్యే ప్రతి వివరాన్ని ఒకటికి రెండుసార్లు పరిశీలించి నమోదు చేయాలని, సాంకేతికపరమైన పొరపాట్లు, డేటా ఎంట్రీలో తప్పిదాలు, వివరాల లోపాలు చోటు చేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ప్రతి అధికారి, బీఎల్ఓ కచ్చితంగా పాటిస్తూ నిర్ణీత గడువులోపు ఎన్యుమరేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఎన్నికల అధికారులు, ఎల్.బి.నగర్ మున్సిపల్ అధికారులు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) పాల్గొన్నారు.

# బాలల రక్షణే ధ్యేయం: సైబరాబాద్‌లో 'ఆపరేషన్ ముస్కాన్-12' ప్రారంభం!

## మిస్సింగ్ పిల్లల గుర్తింపునకు 'దర్పణ్' యాప్.. రంగంలోకి 7 ప్రత్యేక బృందాలు!

**శేరిలింగంపల్లి :జూలై 3, (ప్రభాత ఉదయం)**

వీధుల వెంట తిరిగే అనాథలు, యాచకవృత్తి, బాలకార్మికులుగా మారి నలిగిపోతున్న చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సైబరాబాద్ పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా 'ఆపరేషన్ ముస్కాన్-12' ను ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఉన్నత స్థాయి సమన్వయ సమావేశం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగింది. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎమ్. రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం జులై 1 నుండి 31 వరకు ముమ్మర తనిఖీలు బాల కార్మిక వ్యవస్థ, మానవ అక్రమ రవాణా (ట్రాఫికింగ్), బలవంతపు వెట్టిచాకిరి, యాచకవృత్తి చెత్త ఏరుకునే




ఆపరేషన్ ముస్కాన్ బ్రోచర్ విడుదల చేస్తున్న సైబరాబాద్ సీపీ డాక్టర్ రమేష్..

పనుల నుండి చిన్నారులను విముక్తి చేసి, వారికి పునరావాసం కల్పించడమే ఈ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఈ ఆపరేషన్ కోసం మొత్తం 7 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ప్రతి బృందంలో ఒక సబ్-ఇన్‌స్పెక్టర్ నలుగురు పోలీస్ కానిస్టేబుళ్లు వీరిలో ఒకరు మహిళా కానిస్టేబుల్ ఉంటారు. 'దర్పణ్' యాప్: రెస్క్యూ చేసిన పిల్లలు తప్పిపోయిన బాలలను గుర్తించేందుకు సైబరాబాద్ పోలీసులు సరికొత్త ఫేషియల్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ "దర్పణ్" ను ఉపయోగించనున్నారు. దీని ద్వారా కుటుంబాలకు దూరమైన పిల్లలను సులభంగా గుర్తించవచ్చని సీపీ వివరించారు. గత కేసుల డేటా ఆధారంగా బాలకార్మికులు, యాచకులు ఎక్కువగా ఉండే సమస్యాత్మక ప్రాంతాలను (హాట్‌స్పాట్లు) పోలీసులు ముందే గుర్తించారు. ఆయా ప్రాంతాల్లోనే ప్రధానంగా తనిఖీలు ఉంటాయి. ఈ ఆపరేషన్ మొత్తాన్ని మహిళా బాలల భద్రతా విభాగం డీసీపీ కె. సృజన స్వయంగా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో జులై నెలాఖరు వరకు ఈ ఆపరేషన్ విజయవంతంగా కొనసాగుతుందన్నారు. చిన్నారుల భవిష్యత్తును రక్షించే ఈ బృహత్తర కార్యం కోసం అన్ని శాఖల అధికారులు ఒకరికొకరు సహకరించుకుంటూ, సమన్వయంతో పనిచేయాలని కోరారు. దీనికి హాజరైన అన్ని శాఖల ఉన్నతాధికారులు తమ పూర్తి మద్దతును ప్రకటిస్తూ హామీ ఇచ్చారు. ఈ సమన్వయ సమావేశంలో సైబరాబాద్ సీపీ డా. ఎమ్. రమేష్‌తో పాటు, డీసీపీ కె. సృజన, ఏసీపీ కృష్ణప్రసాద్, మేడ్చల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధి రాజారెడ్డి, సంగారెడ్డి అసిస్టెంట్ లేబర్ కమిషనర్ డి. సాహితి, రంగారెడ్డి డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, మేడ్చల్ మల్కాజిగిరి డీసీపీఓ ఇంతియాజ్, సంగారెడ్డి డీసీపీఓ రత్నం, సంగారెడ్డి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు జి. వెంకటేశం, రంగారెడ్డి మెడికల్ ఆఫీసర్ హలీమ్, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ పి. యాదయ్య గౌడ్‌లతో పాటు పలువురు ఏహెచ్‌టీయూ సిబ్బంది పాల్గొన్నారు.

# మల్కాజ్‌గిరి అభివృద్ధికి పలు కీలక వినతులు సమర్పించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజ్‌గిరి, జూలై 3(ప్రభాత ఉదయం)**

మల్కాజ్‌గిరి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల వేగవంతమైన అమలే లక్ష్యంగా మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే ఈ రోజు హైడ్రా కమిషనర్ ను కలిసి పలు కీలక అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అల్వాల్‌లో ఫైర్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన గ్రామకంఠం భూమిపై కొనసాగుతున్న కోర్టు స్టే అంశాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే, ప్రజల భద్రత దృష్ట్యా ఫైర్ స్టేషన్ నిర్మాణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే అదే గ్రామకంఠం ప్రాంతంలో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్న అధికారులపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



హైడ్రా కమిషనర్ కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

చేశారు. అదేవిధంగా అల్వాల్ జొన్నబండ పరిధిలోని యూఎల్సీ భూములు, సర్వే నంబర్లు 582, 583లోని 22-ూ నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అదే ప్రాంతంలో నివసిస్తున్న వడ్డెర, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన పేద కుటుంబాలకు జారీ అవుతున్న నోటీసుల అంశాన్ని కూడా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, నిరుపేదలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, మల్కాజ్‌గిరి నియోజకవర్గ ప్రజల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ భూముల సంరక్షణ, అభివృద్ధి పనుల వేగవంతమైన అమలే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే సమర్పించిన వినతులపై హైడ్రా కమిషనర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# మల్కాజ్‌గిరి అభివృద్ధి కోసం హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీ.పీ. గౌతమ్‌ను కలిసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజ్‌గిరి, జూలై 3(ప్రభాత ఉదయం)**

మల్కాజ్‌గిరి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజల మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఈ రోజు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్, ఐఏఎస్ ని కలిసి నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అభివృద్ధి అంశాలపై చర్చించి వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు కీలక ప్రతిపాదనలను ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన వినతులు అల్వాల్ ప్రాంతంలోని



భూధాన్ ల్యాండ్స్ సర్వే నంబర్లు 537, 538, 539, 540లో పేద, మధ్యతరగతి కుటుంబాల గృహ అవసరాలను తీర్చేందుకు 2దీఎఖ గృహాల నిర్మాణం చేపట్టాలని కోరారు. మౌలాలి ఆయుష్ వెల్నెస్ సెంటర్ -- యునాని హాస్పిటల్ పరిధిలోని హౌసింగ్ బోర్డు స్థలంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మౌలాలి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (ఖ్రూఎజ) నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కౌకూర్ రాజీవ్ గృహకల్ప సముదాయంలో నివసిస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని వారికి తక్షణమే తాగునీటి వసతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతులను శ్రద్ధగా విన్న తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్, ఐఏఎస్ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, మల్కాజ్‌గిరి నియోజకవర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా గృహ, ఆరోగ్య, తాగునీటి వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం నిరంతరం ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్నామని తెలిపారు.

# మురుగునీటి శుద్ధిలో జపాన్ అత్యాధునిక సాంకేతికత


**హైదరాబాద్‌లో విజయవంతమైన పైలట్ ప్రాజెక్టు**

**జపాన్ బయో-లేస్ సాంకేతికత పనితీరును సమీక్షించిన జలమండలి ఎండీ కె. అశోక్ రెడ్డి**

**జలమండలి- జైకా- టీబీఆర్ సంయుక్త ఆధ్వర్యంలో దేశంలో తొలిసారిగా నాలా శుద్ధి సాంకేతికత ప్రదర్శన**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 3 ( ప్రభాత ఉదయం)**






జలమండలి పరిధిలోని నాలాలు, చెరువులు, డ్రెయిన్ ల శుద్ధీకరణకు వినూత్న పరిష్కారంగా జపాన్‌కు చెందిన అత్యాధునిక బయో–లేస్ సాంకేతికతతో అమలు చేస్తున్న 1 ఎంఎల్‌డీ సామర్థ్యం గల పైలట్ ప్రాజెక్టు పనితీరును జలమండలి ఎండీ అశోక్ రెడ్డి శుక్రవారం పరిశీలించి సమీక్షించారు. పైలట్ ప్రాజెక్టు ద్వారా సాధించిన ఫలితాలు, నీటి నాణ్యతలో వచ్చిన మెరుగుదల, భవిష్యత్ కార్యాచరణపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఫతేనగర్‌లోని జలమండలి ఎస్టీపీ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో జైకా ప్రతినిధులు, టీబీఆర్ సంస్థ సాంకేతిక నిపుణులు జలమండలి ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా), జపాన్‌కు చెందిన టీబీఆర్ సంస్థల సహకారంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు భారతదేశంలో తొలిసారిగా ప్రవహిస్తున్న కాలుష్యగ్రస్త నాలా నీటి శుద్ధీకరణకు అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన బయో–లేస్ సాంకేతికతను ప్రయోగాత్మకంగా అమలు చేసిన ప్రాజెక్టుగా నిలిచింది. జైకా––జలమండలి––టీబీఆర్ సంస్థల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం మేరకు ఈ పైలట్ ప్రాజెక్టును అమలు చేశారు. ఈ సందర్భంగా జలమండలి ఎండీ కె. అశోక్ రెడ్డి మాట్లాడుతూ... జపాన్‌లో ఇప్పటికే 400కు పైగా నదులు, జలమార్గాల పునరుద్ధరణలో విజయవంతంగా ఉపయోగించిన ఈ సాంకేతికత హైదరాబాద్‌లో కూడా ఆశాజనక ఫలితాలను అందించిందన్నారు. పైలట్ ప్రాజెక్టు ద్వారా నిర్వహించిన పరీక్షల్లో నీటి నాణ్యత గణనీయంగా మెరుగుపడటంతో పాటు, పట్టణ నాలాల కాలుష్య నియంత్రణకు ఇది సమర్థవంతమైన, పర్యావరణహిత పరిష్కారంగా నిలుస్తుందని తెలిపారు. మూసీ నదిలో ఒక్క చుక్క మురుగునీరు కూడా చేరకుండా, హైదరాబాద్ నగర పరిధిలో ఉత్పత్తి అయ్యే మురుగునీటిని శాతం శాతం శుద్ధి చేసిన అనంతరమే విడుదల చేయాలన్న సి ఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జలమండలి సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోంది. రానున్న ఏడాదిలో ఈ లక్ష్యాన్ని సాధించే దిశగా వేగంగా ముందుకు సాగుతున్నాం" అని జలమండలి ఎండీ కె. అశోక్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం పైలట్ యూనిట్‌లో పంపింగ్ ద్వారా మురుగునీటిని శుద్ధి చేస్తున్నామని, భవిష్యత్తులో ఈ సాంకేతికతను నేరుగా నాలాలు, వాగుల్లో ప్రవహించే మురుగునీటిపైనే అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్టు ఫలితాలను సమగ్రంగా అధ్యయనం చేసిన అనంతరం నగరంలోని ఇతర ప్రాంతాలకు కూడా ఈ సాంకేతికతను విస్తరించే అంశంపై సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని అధికారులకు సూచించారు. సాంప్రదాయ మురుగునీటి శుద్ధి కేంద్రాలతో పోలిస్తే ఈ బయో–లేస్ సాంకేతికతకు భారీ భూవిస్తీర్ణం అవసరం ఉండదని, 50 శాతానికి పైగా విద్యుత్ ఆదా, 70––85 శాతం తక్కువ భూవిస్తీర్ణం, రసాయనాల వినియోగం లేకుండా సహజ సూక్ష్మజీవుల ద్వారా శుద్ధీకరణ, తక్కువ నిర్వహణ వ్యయం వంటి ప్రత్యేకతలు ఉన్నాయని అధికారులు వివరించారు. అదేవిధంగా బురద ఉత్పత్తి కూడా గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన పైలట్ ప్రాజెక్టులో సేంద్రియ కాలుష్యం లో 90 శాతం, సస్పెండెడ్ సాలిడ్స్ )లో 85 శాతం తగ్గుదల నమోదైందని, దుర్వాసన తగ్గడంతో పాటు నీటిలో కరిగిన ఆక్సిజన్ స్థాయిలు మెరుగుపడి మూసీ, సరస్సులు, నదుల్లోకి చేరే నీటి నాణ్యత గణనీయంగా పెరిగినట్లు టీబీఆర్ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. ఈ సాంకేతికత పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పరిశీలించిన తర్వాత పూర్తిస్థాయిలో భవిష్యత్తులో హైదరాబాద్‌లో నిర్మించనున్న కొత్త మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో ఈ విధానాన్ని అమలు చేసే అవకాశాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి సీజీఎమ్ సుజాత, ప్రాజెక్టు అధికారులు, జైకా ప్రతినిధులు, టీబీఆర్ సంస్థ సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

**ముఖ్యాంశాలు:**

దేశంలో తొలిసారిగా బయో–లేస్ సాంకేతికతతో నాలా శుద్ధి పైలట్ ప్రాజెక్టు. జపాన్ సాంకేతికత ఆధారంగా ఏర్పాటు చేసిన 1 ఎంఎల్‌డీ పైలట్ ఎస్టీపీ. జపాన్‌లో 400కు పైగా నదుల పునరుద్ధరణలో విజయవంతంగా వినియోగించిన సాంకేతికత. బి ఓ డి లో 90%, టి ఎస్ ఎస్ లో 85% తగ్గుదల. 50%కు పైగా విద్యుత్ ఆదా. 70––85% తక్కువ భూవిస్తీర్ణం అవసరం. రసాయనాల వినియోగం లేకుండా పర్యావరణహిత శుద్ధీకరణ. తక్కువ నిర్వహణ వ్యయంతో దీర్ఘకాలిక, సుస్థిర పరిష్కారం.



## ముత్తంగి సమగ్ర అభివృద్ధికి కృషి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**రెండు కోట్ల 37 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**పటాన్ చెరు, జూలై 3 (ప్రభాత ఉదయం):**

ముత్తంగి డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని,సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ముత్తంగి డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో రెండు కోట్ల 37 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, అంతర్గత మురుగు నీటి కాలువలు, బోర్ వెల్స్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు, రక్షిత మంచినీటి వసతులు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముత్తంగి డివిజన్ ను అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన డివిజన్ గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనుల కోసం దశలవారీగా నిధులు కేటాయిస్తూ నిర్దేశిత గడువుగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసమే క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఉపేందర్, మాజీ జెడ్పిటిసి శ్రీకాంత్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ప్రభాకర్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కుమార్ గౌడ్, ఇంజనీరింగ్ విభాగం డిఈ కృష్ణవేణి, ఏఈ ఫైజాన్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కిట్టు, మేరాజ్ ఖాన్, సందీప్, ఆబీద్, రామకృష్ణ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## సంకిరెడ్డిపల్లిలో ఘనంగా బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం

**పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్**

**కొత్తకోట, జూలై 3 (ప్రభాత ఉదయం)**

కొత్తకోట మండలం సంకిరెడ్డి పల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవ పూజ కార్యక్రమం జరిగింది. ఈ పూజల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజల సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం కొత్తకోట పట్టణంలో కనిమెట్ట కోటేశ్వర్ రెడ్డి శ్రీ బాలాజీ ఫర్టిలైజర్, సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ షాప్ ప్రారంభించి శుభాకాంక్షలు తెలియజేసి, తదనంతరం కొత్తకోట పట్టణంలో పలు వివాహాలకు , భూత్పూర్ మండలం షేర్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలలో ఎమ్మెల్యే జియంఆర్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కేంద్రాలుగా గురుకులాలు



**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 3 (ప్రభాత ఉదయం)**



జిల్లాలోని ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కేంద్రాలుగా నిలవాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అన్నారు. శుక్రవారం కేటీదొడ్డి మండలంలో “మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల,జూనియర్ కళాశాల” (బాలుర)ను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా,వసతి,భోజన సౌకర్యాలు, పారిశుధ్యం తదితర ఏర్పాట్లను పరిశీలించి,విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కేంద్రాలుగా నిలవాలని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించడంతో పాటు హాస్టళ్లలో పరిశుభ్రతను ఎల్లప్పుడూ పాటించాలన్నారు. తాగునీటి సౌకర్యం,మరుగుదొడ్లు, వంటశాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికితీసేలా బోధన కొనసాగించాలని,హాజరు శాతం పెంపు, క్రమశిక్షణ,వ్యక్తిత్వ వికాసం, క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక వసతులను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచి, ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో వారికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ తనిఖీలో పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, హాస్టల్ సిబ్బంది , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## డెంగ్యూ, మలేరియాకు చెక్.. “ఫ్రైడే డ్రైడే”తో దోమల నిర్మూలనపై విస్తృత అవగాహన!

**ఎండకాలం పోయింది.. వర్షాకాలం వచ్చింది: వైరల్ రోగాలపై అప్రమత్తత అవసరం.. అంజయ్య నగర్ కాలనీలో సైబరాబాద్ మున్సిపల్ ఎంటమాలజీ విభాగం ప్రత్యేక కార్యక్రమం**

**శేరిలింగంపల్లి జూన్ 3, (ప్రభాత ఉదయం)**

ఎండకాలం ముగిసి వర్షాకాలం ప్రవేశించిన నేపథ్యంలో, సీజనల్ వ్యాధులు, వైరల్ రోగాలు విజృంభించే ప్రమాదం పొంచి ఉందని అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రజలను హెచ్చరించారు. డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే ప్రమాదకర వ్యాధులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కళ్లు తెరిచి అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న “ఫ్రైడే డ్రైడే” కార్యక్రమంలో భాగంగా అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ కాలనీలో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారానికి ఒకసారి ‘డ్రైడే’ పాటించాలి: ఎంటమాలజీ ఏఈ సునీతఈ సందర్భంగా ఎంటమాలజీ విభాగం అసిస్టెంట్ ఏ ఈ సునీత మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వంటి అర్బన్ వెక్టర్ బోర్న్ వ్యాధులు దోమల ద్వారానే వ్యాపిస్తాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు, కూలర్లు, పూలకుండీలు తదితర నీటి నిల్వ పాత్రలను వారానికి ఒకసారి తప్పనిసరిగా ఖాళీ చేసి, శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, డ్రైనేజీలు మురుగు కాలువలు, ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమల ఉత్పత్తిని ప్రాథమిక దశలోనే అడ్డుకోవచ్చని వివరించారు. అవసరమైన ప్రాంతాల్లో యాంటీ లార్వల్ స్ప్రేయింగ్, ఫాగింగ్ వంటి నివారణ చర్యలు చేపట్టేందుకు మున్సిపల్ సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నిర్మూలన సాధ్యం: ఆంజనేయులు సాగర్అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ కేవలం అధికారుల చర్యల వల్లే కాకుండా, ప్రజల భాగస్వామ్యంతోనే దోమల పూర్తి నిర్మూలన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ప్రతి కుటుంబం తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంట్లో తడి, పొడి చెత్తను రోడ్లపై వేయకుండా తప్పనిసరిగా మున్సిపల్ చెత్త బండిలోనే వేయాలని కోరారు. వర్షాకాలంలో వచ్చే భయంకరమైన వైరల్ వ్యాధుల పట్ల ప్రజల్లో కనువిప్పు కలిగించేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని, అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అంజయ్య నగర్ డివిజన్ ప్రజలు రోగాల బారిన పడకుండా డివిజన్‌ను ఆదర్శంగా నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అంజయ్య నగర్ కాలనీ వాసులు తిరుపతయ్య సాగర్, గాల్ రెడ్డి, ఎంటమాలజీ విభాగ మున్సిపల్ సిబ్బంది మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ళి9:12 జూఎ, 3/7/2026రి ఖుఝుఝుఎ: ఫోటోరైటప్ :(3) అంజయ్య నగర్ లో “ఫ్రైడే డ్రైడే” అవగహన కల్పిస్తున్న ఎంటమాలజీ విభాగం అధికారులు..

## మల్లాపురం తండాలో వ్యక్తి హత్య.. కేసు నమోదు చేసిన పోలీసులు

**గద్వాల జిల్లా ప్రతినిధి జూలై 3 (ప్రభాత ఉదయం)**



కేటిదొడ్డిమండల పరిధిలోని మల్లాపురం తండాలో గురువారం జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడిన రాజు నాయక్ (45) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు:మల్లాపురం తండాకు చెందిన రాజు నాయక్ (45) పై.. ఆయనకు వరుసకు అల్లుడైన పాండు నాయక్ అనే వ్యక్తి గురువారం మధ్యాహ్నం తీవ్ర ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో పాండు నాయక్ విచక్షణారహితంగా దాడి చేస్తూ రాజు నాయక్ పొత్తికడుపులో మోకాలితో బలంగా తన్నాడు. అంతటితో ఆగకుండా చేతిలోని కట్టెతో రాజు నాయక్ తలపై, నుదిటిపై కొట్టి తీవ్ర రక్తగాయాలు చేశాడు. దాడి జరిగిన అనంతరం శుక్రవారం తెల్లవారుజామున రాజు నాయక్‌కు తీవ్రమైన కడుపునొప్పి మొదలైంది. మూత్రం కూడా రాకుండా నరకయాతన పడుతుండటంతో, కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడి భార్య నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

## వారం రోజుల నుంచి.. అడ్డగోలుగా మట్టి తరలింపు

**రైతులు పోలీసులకు సమాచారమిచ్చినా స్పందన శూన్యం**

**మామూళ్లు మత్తులో అధికారులు**


**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 3 ( ప్రభాత ఉదయం)**



ధరూర్ మండలంలో మట్టి మాఫియా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది. అక్రమంగా మట్టి తరలించి కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. ధరూర్ మండలం జాంపల్లి గ్రామ శివారులో ర్యాలంపాడు రిజర్వాయర్ గ్రావిటి కెనాల్ నిర్మించారు. రిజర్వాయర్ గ్రావిటీ కెనాల్ వద్ద నిల్వ ఉంచిన ప్రభుత్వ మట్టిని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నిఘా లేకపోవడంతో అక్రమార్కులు గ్రావిటి కెనాల్ మట్టిని ధరూర్, కేటిదొడ్డి మండలాలతో పాటు గద్వాల పట్టణంలో వెంచర్లు, ఇండ్లకు మట్టి తరలిస్తూ అడ్డూ అదుపు లేకుండా వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండటంతో మాఫియా ఆగడాలకు అంతులేకుండా పోతోందన్న వెల్లువెత్తుతున్నాయి. అధికారులు మాత్రం తమకు ఫిర్యాదు అందలేదంటూ తమ బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వారం రోజులుగా ర్యాలంపాడు కాలువ మట్టిని అక్రమంగా బహిరంగానే తరలిస్తున్న అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు మట్టి వ్యాపారులు అధికారులను, రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకుని తమకు ఎదురే లేదన్న ధోరణిలో తమ అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. మట్టి మాఫియాకో న్యాయం మాకో న్యాయమా? గత వారం రోజుల నుంచి పగలు రాత్రి తేడా లేకుండా జాంపల్లి వద్ద ఉన్న ర్యాలంపాడు కాలువ మట్టిని అక్రమార్కులు టిప్పర్లలో తరలిస్తూ పెద్దగా శబ్దాలు చేస్తూ రాకపోకలు సాగిస్తుండడంతో జాంపల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ.కోట్ల విలువ చేసే పంటపొలాలను ర్యాలంపాడు రిజర్వాయర్ కాలువ నిర్మాణానికి ఇస్తే కొంతమంది అక్రమంగా మట్టి తవ్వుతున్నారని వారు వాపోయారు. కనీసం పోలీసులుగానీ, ప్రభుత్వంగానీ, ఇరిగేషన్ అధికారులుగానీ అడ్డుకోవడంలో విఫలమయ్యారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మట్టిని తరలించాల్సిందిగా ధరూర్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చినా ఎవరూ స్పందించలేదని తెలిపారు. ర్యాలంపాడు రిజర్వాయర్ కాలువ కోసం భూములు ఇచ్చి త్యాగం చేసిన రైతుల ఇండ్ల నిర్మాణాలకు ఎప్పుడైన మట్టిని తరలిస్తుంటే ధరూర్ పోలీసులు క్షణాలలో వచ్చి మట్టి తరలింపును నిలిపివేసి కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. గత వారం రోజుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రిజర్వాయర్ కాలువ మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని జాంపల్లి రైతులు ప్రశ్నిస్తున్నారు. పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులకు మాముళ్లు అందాయి కాబట్టి మట్టి రవాణను అడ్డుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మట్టి మాఫియా బరితెగించి మట్టి తరలిస్తున్న అధికార యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపించారు. ఈ దోపిడీకి పాల్పడుతున్న మట్టి మాఫియాపై, వారికి సహకరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు

## ఒంటికి.. రెంటికి.. గోడ దుంకాల్సిందే

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 3 (ప్రభాత ఉదయం)**



ధరూర్ మండలం ర్యాలంపాడు రిజర్వాయర్ వద్ద ఉన్న కేటిదొడ్డి ఎంజేపీటీ బీసి వెల్ఫేర్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు అసౌకర్యాల మధ్య చదువులు కొనసాగిస్తున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఒంటికి, రెంటికి ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. పగలు రాత్రి తేడా లేకుండా రెండింటికి గోడ దూకి వ్యవసాయ పొలాల వెంబడి వెళ్లాల్సి వస్తుందని విద్యర్థులు ఆరోపించారు. రాత్రి వేళలో ఏదైన పురుగు పుట్ర కరిస్తే విద్యార్థుల ప్రాణాల మీదకు ఆపదవచ్చే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుత్తేదారుల నిర్లక్ష్యంతో బాత్రూమ్ నిర్మాణాలు ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉన్నాయి. వేసవి సెలవుల్లోనే ఈ సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యం చూపారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా నిర్మాణాలు చేపట్టక పోవడం, నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభమైన గురుకులాల అధికారులు దృష్టి సారించి మూత్రశాలలు, బాత్రూమ్ లు నిర్మించడం లేదన్నా ఆరోపణలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బాత్రూమ్ నిర్మాణాలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.